

పి.యస్.పి.శాస్త్రి

అనగనగా యేడుగురు స్నేహితులం. పిక్నిక్‌కి వెళ్ళాం. ఒకచోట కూర్చున్నాం. త్రాగాం ... తిన్నాం ... పేకాట ఆడాం. కొంట్లు చదివించుకున్నాం. కాని అందులో ఒక స్నేహితుడివేమీ చేయలేదు. వాడి పేరు మేఘం. గీతా మృతం వాణ్ణి 'మబ్బా' అని పిలుస్తాడు. మేం కూడా అంతే!

'మబ్బా ... మబ్బా! నువ్వెందుకు త్రాగవ్?'

'నాకు అన్నయ్యం...ఎక్కదు!'

'పోనీ సిగరెట్టో...!'

'ఛీ ఛీ...డర్టీ స్మెల్లు!'

'ఐతే...జూదం?!'

'అయ్యో! రాదే...!'

'మరి చాక్లెట్లూ, బిస్కట్లూ తింటావా అమ్మా!'

'ఓయస్...ఎందుకు తిన్ను? శుభ్రంగా తింటా!'

'చచ్చావ్!' చలంగాడు కసిరాడు. 'ఒరేయ్ మబ్బా! నువ్వు త్రాగవ్... సరే! సిగరెట్లు కాల్చవ్ ... సరే! గంబ్లింగ్ రాదు... అదీసరే! యిహ వాగకు... ఆట్టే వాగితే పీక పిసుగుతా!'

'నో రమ్మియ్ రా!' నేను కల్పించుకున్నాను. 'మనం చెడాం గదా అని వాడూ చెడలా!'

'బయల్దేరాడండీ పెద్ద! ఏంరోయ్ శాసూ! నీకీమధ్య కాఫీ పోయిస్తున్నాడేంటి మబ్బుగాడు? వకాల్తా పుచ్చుకున్నావ్!!' చారి యికిలించాడు.

'ఆపండ్రా మీ గొడవ! ముక్కలు కలపరా మువ్వ' జూద పితామహ రాయుడు ఉవాచ.

నేను పేక కలిపాను. గీతిగాడు కోశాడు. ఇందాకట్నుంచీ మాటాపలుకూ లేకుండా

ముంగిలా కూర్చున్న రంగనాథం ఉలు తిప్పాడు. రాయుడు హరహరా అంటూ ఒరిగి పోయాడు. నేను కౌంటిచ్చాను. నా వెన కనే కూర్చున్న మబ్బుగాడు నిట్టూర్చాడు.

ఆకాశంలో మేఘాలు అలుముకున్నాయి. ఆట ఆపి మళ్ళీ మందు కొట్టేస్తోంది మిత్రబృందం. ఈ పిక్నిక్ యేర్పాట్లన్నీ చేసిన గీతిగాడు నిషాలో వాగేస్తున్నాడు రేపు కాలేజీ యెలక్షన్లలో యెవరెవర్ని యెలా పట్టాల్సిందీ!

ఫెళ్ళున్న చీకట్లు కమ్మాయి. ఇంటికి బయల్దేరాం. 'చారి' రానంటే రానన్నాడు మైకంలో పడి కొట్టుకుంటూ. గీతిగాడూ, చలం వాణ్ణి తన్ని, కొట్టి, నాడి చొక్కా చించి లాక్కొచ్చి కార్లో పడేశారు. కారు కంగరుగా పరుగులు పెట్టింది. అప్పటికి టైము ఆరుముప్పావ్ కావస్తోంది. 'బ్రహ్మచారి నిలయం' చేరుకునేసరికి యెనిమిదింబావయింది.

ఆ తర్వాత నేనూ, మబ్బూ, గీతామృతం, చలం నలుగురం కలిసి చారిని మోసుకుని మేడమీదికి తీసుకువెళ్తాంటే రంగనాథం బ్యాటరీ లైటేసి మెట్లమీద దారి చూపించాడు. రాయుడు ఆంజనేయ దండకం చదివాడు. లోపలికెళ్ళి చారిని పడుకోబెట్టిన్తర్వాత అందరం డ్రెస్సు మార్చుకుంటూంటే చారి లేచి కూర్చుని 'నా పాంటేది మొర్రో!' అని అరిచాడు. 'సి దుంపతెగ! మైకంలో వున్నట్టు నటించి మమ్మల్ని చంపుతావటా!' అని అంతా విరుచుకుపడ్డారు. చారి బాత్‌రూంలోకి పరుగెట్టాడు.

* * *

'చూడండి మిస్; నా పేరు గీతామృతం. ఫ్రెండ్స్ 'గీతిగా' అంటారు. చాలా నీతిగలవాణ్ణి. అఫ్‌కోర్స్... రాజేష్ ఖన్నాలా నటించనూలేను, కిషోర్కుమార్లా పాడనూ లేను ...కానీండి యేదో కళాభిరుచి గలవాణ్ణి! డ్రమాటిక్ ప్రెసిడెంట్‌గా పోటీ చేస్తున్నాను. మీ వోటు, ప్లెస్ మీ చెలికత్తెల వోట్లు...అన్నీ కలిపి ఒక్కుమ్మడిగా ... అరె! ... వెళ్తారేం! ఆగండాగండి...ప్లీజ్...పార్వతీదేవీ...' చలం భుజాలమీద యెక్కి కూర్చున్న చారి కిచకిచ లాడాడు. 'ఏం జరిగిందా?!' కుతూహలంగా ప్రశ్నించాడు చలం. అప్పుడే నేనూ మబ్బూ అటుగా వెళ్ళాం. 'ఏమిట్రా! ఇక్కడ గుమిగూడారు?' అనడిగాడు మబ్బు. చారి క్రిందికి దూకాడు హనుమంతుడిలాగా చలం భుజాలమీంచి!

'మరేరా! మన గీతిగాడు ఓటు అడగటం కోసమని 'పార్వతీ దేవి' లేదూ.... ఆవిణ్ణి కలిశాడ్రా. ఆవిడేమో విదిలించుకుంటూ వెళ్ళిపోయింది. అంతే ... అంతకంటే యేంలేదు.'

'అందుకని...సిగ్గులేకుండా యీ కిటికీ వెనకాల వాడి భుజం యెక్కి కూర్చుని చూస్తున్నావా! బుద్ధిలేదూ ... పదండవతల్కి.' కసిరాడు మబ్బు. అంతా కిక్కురుమనకుండా సర్దుకున్నారు.

* * *

బియ్యేస్సీ ఫైనలియర్లో 'గీతామృతం' అనే ఒక నాజూకైన కుర్రాడు, నిజం చెప్పాలంటే కాలేజిలో హీరో. వాడేదంటే మిత్రబృందం అదే అంటుంది. వాడో చిన్న సైజు యువరాజు. అందరు కుర్రాళ్ళలాగా హాస్టల్లో వుండడు. వేరే యిండిపెండెంట్ హవుస్ తీసుకుంటాడు. అందర్లా ఒంటరిగా వుండలేడు ఇంకో అరడజను మిత్రుల్ని తోడుగా వుంచుకుంటాడు; అందరిలాగా సైకిలుమీదరాడు. కార్లో మిత్రబృందంతో కలిసి వస్తాడు.

ఐతే...గీతామృతంలాంటి క్వాలిఫికేషన్స్ వున్నవాళ్ళు యింకెవరూ లేరా? అంటే...వుండొచ్చు! కానీ గీతామృతంలో ఒక స్పెషాలిటీ వుంది వాడు స్నేహంకోసం పుట్టాడు. స్నేహం కోసమే బ్రతుకుతున్నాడు. స్నేహం కోసమే ఛస్తాడు కూడా...

పైగా

వాడికి ఆడవాళ్ళంటే అసహ్యం...పరమ హేట్రెడ్ (ట!) ... అందుకనే మా మిత్రబృందానికి 'ఫార్ ఫ్రమ్ ది లేడీస్ క్రౌడ్' అని పేరుపెట్టి నాయకత్వం వహించాడు... మాటకొస్తే మా మిత్రబృందంలోని ప్రతిఒక్కరూ గీతిగాడితోస్నేహంచేయటం తమ అదృష్టంగానే భావిస్తారు. అలా అని వాడు పోజివ్వడు. వాడూ మాలాంటి మిత్రులు దొరకటం తన అదృష్టం అంటాడు. మా మిత్ర బృందంలో యూనివర్శిటీ ఫస్టు వచ్చే మబ్బుగాడూ వున్నాడు. కాలేజీని పోషించటమే కంకణంగా పెట్టుకున్న చారి వున్నాడు. మిగిలిన వాళ్ళమంతా కూడా కొద్దోగొప్పో చదివే వాళ్ళమే అయినా మా రిజల్ట్సుకి సంబంధించిన ఘనత అంతా 'మబ్బుగాడిదే' అని యేకగ్రీవంగా ఒప్పుకోక తప్పదు.

ఏతావాతా తేల్చిందేమిటయ్యా అంటే... మా మిత్ర బృందంలోని యే ఒక్కరూ అమ్మాయిల వంక చూడరు సరిగదా ... తలవన్నైనా తలవరు. అసలిది అసోషియేషన్ ఫ్రేమ్ చేసిన రూల్స్‌లోనే వుంది. రూల్స్ ఫ్రేమ్ చేసింది మళ్ళీ గీతిగాడే! ఎందుకంటే యీ అమ్మాయిల మూలంగానే స్నేహం చెడిపోతుందట. 'సరే ... ఇదీ మన మంచికే' అని అంతా ఒప్పుకున్నందువల్ల జరిగిన మంచి యేమిటంటే... కాలేజీలోని ప్యూన్ దగ్గర్నించీ ప్రిన్సిపాల్ దాకా అందరూ మా బృందం యొక్క యీ ఆదర్శానికి జోహారు పలకటం; చెడేమిటయ్యా అంటే మా బృందంలోని మెంబర్ల సంఖ్య 'యేడు'తోనే నిలిచిపోవటం. ఇది విన్నప్పుడు మాత్రం 'ఇంత పెద్ద కాలేజీలో మేము తప్ప మిగిలిన వాళ్ళెవరూ స్త్రీకి... ఐమీన్... యువతులకి దూరంగా వుందామనుకోవటల్లేదా!'' అని ఆశ్చర్యపోయినమాట నిజం! తోక తప్ప మిగిలిన విషయాల్లో కోతులంత కోతి వెధవలు చారీ, చలం. వాళ్ళు కూడా అమ్మాయిల్ని యేడిపించటం.. పేర్లు పెట్టటం మానేశారు. కనీసం చూడరు. కనిపిస్తే కళ్ళు మూసుకుంటారు.. అని వాళ్ళంటారు. నా కనుమానమే ఐనా ... 'అనుమానపడటం' మళ్ళీ మా రూల్స్‌కి విరుద్ధం. అందుకని మానేశాను.

మరి యిన్ని ఆదర్శాలపుట్ట... నీతికోవిదుడూ... స్నేహపాత్రుడూ పార్వతీదేవితో యెందుకు మాట్లాడాడంటే... అసలు కథ మొదలయిందిక్కడే!!!

ఫైనలియర్లో కొచ్చేసరికి అందరం అన్ని సబ్జెక్టులూ పూర్తిచేశాం. గీతిగాడు మాత్రం వాడి దర్జాకి తగదన్నట్టు రెండు మిగుల్చుకున్నాడు. మిగిలినవైనా 'మబ్బుగాడు' తిట్టగా తిట్టగా చదివి నెట్టించాడు. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం... స్టాఫ్‌లోనే అల్లకల్లోలం తెచ్చిన విషయం చారిగాడు మొత్తం పరీక్షల్లో నెగ్గటం! అదెలాగయ్యా అంటే... నేన్చెప్పను,

చెప్పేసరంటే స్మాక్‌కి తెలిసిపోతుంది.. వాడు మళ్ళీ ఫైనల్స్‌లో ఫ్యాస్‌కాడిహా!

ఇలా రెండు మిగుల్చుకున్న గీతిగాడూ, ఒక్కటైనా మిగల్చని చారిగాడూ మళ్ళీ అలవాటు ప్రకారం పుస్తకాలవేపు చూడనైనా చూడటంలేదు. 'అదేంరా?' అని ముందలిస్తే 'చూద్దాం' అన్నాడు గీతామృతం. "తప్పు! చదువుల తల్లికి కోపం వస్తుంద్రా ఫస్ట్‌టరంలోనే చారి చదువు మొదలెట్టాడని"! అన్నాడు చారి.

ఇంతలో యెలక్షన్లు వచ్చాయి. "ఇదే ఆఖరు సంవత్సరం. అది కూడా పోటీచేస్తే పోద్దామని వుంది" అన్నాడు గీతం వో రోజు రాత్రి. అందరం చర్చించాం. "నువ్వు చేసేది మాత్రం యేమేడ్చిందిలే... సరే కానీయ్!" అన్నాడు సుబ్బు. నేనూ "మన లోనూ ఒకడు స్టూడెంట్స్ కమిటీలో వుండటం మంచిదే!" అన్నాను. సరే! ఏవ రేపని చేయాలి అనే విషయం మీద చర్చించాం. నన్ను అడ్వైజర్‌గా నియమించారు. "నాయుడూ, రంగనాథం ప్రోపగాండా సగ్గెడాలు చూసుకుంటారు. చలం, చారి అపోజిషన్ విషయాలు కనిపెట్టూ ఉంటారు. సుబ్బు సి. ఐ. డి. ఇదీ మన ప్లాను' అన్నాడు గీతం.

"మరి... అమ్మాయిల వోట్లు....." అడిగాడు చారి.

"హతోస్మి!" చెవులు సగం మూసుకున్నాడు చలం.

"అది గీతిగాడే చూసుకుంటాడులే" అన్నాడు అడ్వైజర్.

"సరే! యిహ పదండి!" కదిలాడు సి. ఐ. డి.

* * *

కాలేజీ బ్యాచ్ అని ఖ్యాతికెక్కి, మా మిత్ర బృందాన్ని గురించి, దాని ఆదర్శాలను గురించి విన్న పార్వతీదేవి "సాంగ్ ఫర్‌ది 'డర్టీ' బాయ్స్ కోడ్" అనే ఒక సమాజం స్థాపించి కాలేజీలో వున్న అమ్మాయిల నందర్నీ అందులో చేర్చుకుంది. పైపెచ్చు మా మిత్ర బృందంలో ఒక 'సుబ్బుగాడు' తప్ప యింకెవరు కన్పించినా 'మొహం చిట్లించుకోవటం' వాళ్ళ బృందం (షేప్ చేసిన రూల్స్‌లో ముఖ్యమైనదని కూడా ప్రతీతి. ఇలాంటి వార్తలన్నీ అప్పుడప్పుడు చారి, చలం నా చెవిని వేస్తుంటారు. వాళ్ళకివన్నీ యెలా తెలుస్తున్నాయనే అనుమానం నాకూ కలిగినా అంతటితో ఆపేశాను.

ఇదివరకోసారి ఒకానొక శుభముహూర్తాన యెవరికీ తెలీకుండా నేనూ, గీతిగాడూ పార్వతీదేవిని కలిసి ఆ 'డర్టీ'ని తొలిగించి "షార్ ఫర్‌ది బాయ్స్ కోడ్" అని పెట్టుకోమని రిక్వెస్టుచేసి, అది తప్పని నచ్చ చెప్పటానికి ప్రయత్నించినప్పుడావిడ మా సలహాకి 'థాంక్స్'సీ, అంత వరకూ మాతో మాట్లాడటమే తమ ఆదర్శాలకి విరుద్ధమనీ, యింకోసారి యెప్పుడైనా అలా పలకరిస్తే లీగల్‌గా ప్రొసీడవాల్సి వస్తుందనీ హెచ్చరించిన్నాటి రాత్రి మేం నిద్దరోలేదు. గీతిగాడు "మరి మీరంత ఆదర్శవంతులైతే అప్పుడప్పుడూ మా 'సుబ్బుగాడి'తో యెందుకు మాట్లాడేస్తుంటార"నడిగితే, పార్వతీదేవి ఆ 'డర్టీ' పదం కేవలం మాలాంటి వాళ్ళకోసమే వుంచబడిందని చెప్పినప్పుడు నేను "ఈ భూమి బద్దలవ్వదే... ఆకాశం క్రుంగిపోదే... ప్రపంచం తలక్రిందు లవ్వదే..." అని విపరీతసగా ఘోషించాను మనసులో. ఆ రాత్రి సుబ్బుగాడొచ్చి 'యేమిట్రా అలా వున్నారం'టే "ఆ! అదే... పరీక్షల్ని గురించి దిగుల"న్చెప్పి వాణ్ణి నిద్దరోపి "ఏడీ అదృష్టాన్ని నిద్దరోపలేం గదా!" అని మనసులో అనుకుని 'కింకర్తవ్యమ్?' అని ఘోషించి ఆ విషయాన్ని అంతటితో వదిలేశాం.

ఆ తర్వాత గీతామృతం "పారూ... పారూ" అని నిద్దర్లో కలవరించటం నేను చాలాసార్లు విని యేం యెరుగనట్టూరుకున్నాను. మళ్ళీ వో నెల తర్వాత ఒక రోజు రాత్రి గీతిగాడు గభాల్న నిద్ర లేచి కూర్చుని "రేయ్ శాసూ! నేను పార్వతిని ప్రేమిస్తున్నా(రా... పారు లేన్దే బ్రతకలేన్రా" అంటే "హోరారేయ్! మన అసోషియేషన్..." అంటూ నే నింకా చెప్పబోయేటంతలో "సర్లేరే!" అంటూ నను గుత్తూ వాడు పడుకోవటం... యిదంతా సెకండియరెండింగ్‌లో జరిగిన సంగతి!

మళ్ళీ యిప్పుడు. . . .

గీతామృతం పార్వతీదేవిని కలిశాడని... అదీ మాట్లాడకుండా విదిలించుకుని వెళ్ళిందని విన్నప్పుడు నా గుండె నిమిషానికి రెండొందలసార్లు కొట్టుకోవటం మాటలా వుంచి... "అసలు వీడు గెలుస్తాడా?" అని వో అనుమానం మెలిసింది మనసులో! ఆ అనుమానం పెనుఘాతమై, నా చేత కాలేజీ యెగ్గొట్టింపజేసి వెంటనే రూమ్‌కి చేర్చింది. బెడ్‌మీద వాలానో లేదో బయట కారొచ్చిన మోత వినిపించింది. కణతలు నొప్పిగా వున్నాయి... కళ్ళు మూసుకున్నాను.

ఇంతలో గీతామృతం , 'సుబ్బు' తప్ప మిగిలిన అందర్నీ వెంట పెట్టుకుని వచ్చాడు. నాకు దగ్గరగా వచ్చి లేపే ప్రయత్నం చేస్తుంటే "నన్ను విసిగించకండ్రా! అసలే ఒంట్లో బాగోలేదు," అన్నాను కసురుతూగా. "ఏమైందిరా? ఒంట్లో యెలా వుంది? డాక్టర్ని పిలవనా!" కంగారు పడుతూ అన్నాడు గీతామృతం. వాడి ఆప్యాయతకి జాలేసింది. లేచి కూర్చుంటూ "అంతగా యేంలేదు గానీ... యేమయిందేమిటి?" అడిగాను.

చారి ముందు కొచ్చాడు చెప్పటానికి. "అసలేం జరిగిందంటే..." అని మొదలెట్టగానే, "నువ్వాపు... రంగాన్ని చెప్పనీ... నువ్వైతే యివాళ్ళ తెమల్చవ్!" అన్నాడు చలం. రంగనాథం యేకరువు పెట్టాడు. "పార్వతిగానీ... యింకే యువతిగానీ గీతిగాడికి వోటెయ్యదురా! ఎందుకని నేనే చెప్ప నవసరం లేదు. ఆ డర్టీ గర్ల్సుకి మాలో ఒక్క 'సుబ్బు' గాడి మీద తప్ప యింకె వరి మీదా సదభిప్రాయం లేదు. అందుకు కారణం యీ మిత్ర బృందం ఆదర్శాలూ... అందుకు విరుద్ధంగా చారీ, చలం చాటు చాటుగా అమ్మాయిల్ని యేడిపించటాలూ కూడా...! కారణాలు అనేకం వున్నాయి యింకా! కానీ ప్రస్తుతానికి కావల్సిందేమిటయ్యా అంటే అమ్మాయిల వోట్లు లేన్దే గీతిగాడు గెలవటం అబ్సర్డ్! పోనీ పోటీ మానేద్దామా అంటే యిప్పటికే అందరికీ తెలిసిపోయింది. పాంప్లెట్స్ కూడా తయారయ్యాయి. యిప్పుడు ప్రిస్టేజ్ ప్రాబ్లెమ్. చివరిసారిగా వాళ్ళ వోట్లు పొందటానికి ఒకటే మార్గం. అది... నువ్వూ, సుబ్బూ కలిసి పార్వతీదేవిని కలుసుకుని రిక్వెస్టు చేయటం."

నేను వెంటనే 'సరే' నన్నాను మళ్లీ ఒకసారి పార్వతిని పలకరించవచ్చుననే అభిలాషతో. "కానీ, పార్వతి మా మాట వింటుందన్న నమ్మక మేమిటి?"

"వింటుంది. పారు నన్ను అన్యాయం చేయదు!" గీతిగాడు దేవదాసులాగా అన్నాడు.

మిత్రబృందం ఆశ్చర్య సాగరంలో మునిగి తేలింది డైలాగుతో. "పారు... పారా... ఏమన్నావ్... పా...రా!" రంగనాధం కీచు కీచుగా అరుసు నాడు.

"ష్! నోర్మూయ్!" అని వాణ్ణి ప్రూరుకో బెట్టాన్నేను. చలం, చారి, రాయుడూ జేబు ల్లోంచి రుమాళ్లు తీసుకుని నెత్తిమీద వేసుకున్నారు. రంగనాధం కొయ్యబారి పోయాడు. నేను కదిలాను.

* * *

"వీడు పేరు మేఘం. మేమంతా 'మబ్బు' అంటాం!" ఎలా మొదలెట్టాలో తెలిని నేను కథ మబ్బుగాడి మీదగా మొదలెట్టాను.

"అవును. అదో 'జబ్బు' మీకు" కటువుగా అంది పార్వతి.

అప్పటికే సగం జలు బొదిలింది నాకు. మళ్లీ భూకంపాలూ... ప్రళయాలూ... కళ్ళు తిరగటాలూ మొదలెట్టాయి. ఐనా తమాయించుకుని "ఇదేమిటి చెప్మా?! ఈవిడ ధోరణేమిటి? ఐనా సరే, తొణ క్కాడదు" అనుకుంటూ... పైకినవ్వుతూ "అహహా! అదికాదండీ ... వీడు

# దహూత మేఘం

న్నాడు చూశారూ... వీడికి చదువు తప్ప ఋంకో లోకం తెలీదు. జె(నల్ నాలెడ్జి అస్సల్లేదండీ., పరమ డిమ్మ. అందుకని మబ్బులాగా కూర్చుంటాడని మా గీతి గాడు వీణ్ణి ముద్దుగా 'మబ్బ'ంటాడు. కదుగా!" సాగదీస్తూ అన్నాన్నేను, నన్ను నేను కాపాడుకోటానికి వాణ్ణి చవటని చేయుటమే ఉత్తమం అనితోచి.

'అవున'న్నట్టు తలూపాడు వాడు అమాయకంగా! ఆ క్షణంలో నాకు మబ్బు గాడెంత ముద్దొచ్చాడని. ఆహా! నేనేమో వాణ్ణి 'దద్దమ్మ'గా పరిచయం చేస్తోంటే వాడు నన్ను డిఫెండ్ చేయటానికి తన్ను తానే చిన్నబుచ్చుకుని తన ఆధిక్యతనీ, స్నేహపాత్రతనీ నిరూపించుకుంటున్నాడు.

"ఒరేయ్ మబ్బుగా! నీకూ, నీ బాబుకీ, నీ తాతకీ.... పదివేల నమస్కారాలు. రియల్లీ అయామ్ ప్రౌడాఫ్‌యూ రా!" మనస్సులోనే కృతజ తలు తెలుపుకున్నాను.

ఇంతలో పార్వతి అన్నది: "మీ గీతా మృతాన్ని మేము 'పీతామృతం' అని పిలుస్తాం. మీరు కూడా మాతోమాట్లాడి నంతసేపూ అలానే పిలవాలి.". హతోస్మి! అయ్యో గీతిగా! నీ కేం కష్టం వచ్చి పడిం దిరా!" అని మనసులో అనుకుందామను కుని పైకే అనేశాను. (పక్కనున్న మబ్బు గాడు తలవంచుకున్నాడు. ఎదురుగావున్న పార్వతి కిసుక్కున నవ్వింది.

"వద్దు పార్వతీ... అలా నవ్వకు! దయ చేసి నవ్వకు. నేను భరించలేను. ఆ నవ్వులు నా రక్త ప్రసారాన్ని ఆపేస్తున్నాయ్" అని చెప్పాలనిపించింది. మళ్లీ అసలు విషయం గుర్తు కొచ్చింది. లేని నవ్వు తెచ్చిపెట్టుకుని,

"అసల్విషయం యేమిటంటే... మా 'గీతగాడు'... (క్షమించరా గీతాయ్. యీ దెయ్యం నన్నిలా పలికిస్తోంది.) ... "ఎలక్షన్లో పోటీ చేస్తున్నాడు."


అందుకుంది పార్వతి "వోట్లు కావాలి, అంతేగా... సారీ మిస్టర్! చాలా కష్టపడి వచ్చారు. కాని మీ పీతామృతానికి పోటీగా నిలబడ్డ రంగారావ్ మా కజిన్. ఇంక చెప్పేదేముంది?!"

"అవును. చెప్పే ముంది? నా మొహం!!" నసిగాను.

మబ్బుగాడు లేచాడు. బయటికొస్తోంటే "ఉంటానండీ! నమస్కారం" అంది, పార్వతి సీణానాదంలా! ఆ నాదానికి మైమ రచి వెనక్కి తిరిగి 'నమస్తే' అన్నాను. నా ఖర్మ్కాదు ఆవిడ చెప్పింది. మబ్బుగాడికి... మళ్లీ వాడిమీద సానుభూతి పోయింది. (అరె! ఇదేమిటి?! ఇంత సేపూ నేను చచ్చి చెడి మాట్లాడితే యీవిడ వాడిని విష్ చేస్తున్నదేమిటబ్బా!! ఒరేయ్ మబ్బుగా! నువ్వు విలన్‌లా తయారవుతున్నావ్‌రా! చంపుతా నిన్ను. పద రూమ్‌కి.)

'బ్రహ్మచారి నిలయం' చేరేవరకూ వాడితో మాట్లాడనేలేదు. ఈ కథేమిటో అంతు పట్టటల్లేదు. అక్కడ మిత్రు లంతా చకోరాల్లా యెదురు చూస్తు న్నారు. వెళ్లంగానే అందరూ చుట్టు ముట్టేసి "యేం జరిగిందేంజరిగింద"ని ప్రశ్నలు. వీటన్నిటి మధ్యా నాకు 'వీళ్ల ఆసక్తి పీతగాణ్ణి...కాదు...గీతిగాణ్ణిగురించా పార్వతిని గురించా' అనే అనుమానమూ కలగక పోలేదు.

ఎంతవరకూ సెన్సార్ చేయాలో అంతా చేసి విషయం అంతా చెప్పాడు మబ్బు గాడు. విషయం విన్న గీతిగాడు హిస్టీరియా వచ్చినట్టు కొట్టుకుంటున్నాడు. నేనేం చేయను?! "ఒరేయ్ గీతం ఊరుకో... ఊరుకో!! నువ్వు తప్పకుండా గెలుస్తావ్. నేను గెలిపిస్తా. డోంట్‌వర్రీ!" అని వోదార్చాను, దుఃఖార్తికి ఔషధం వోదార్పే



వాని వుద్దేశ్యంతో. కానీ గీతిగాడి యేడు పంతా యెలక్షన్లని గురించికాదనీ నాకు తెలుసు!

కాస్సేపు నిశ్శబ్దం రాజ్యం యేలింది.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ మబ్బులన్నాడు. "గీతిగా! నువ్విహ గెలవ్వు!" ఆ రంగారావ్‌కి బోలెడు మెజారిటీ వుంది. వాడు కమిటీ ప్రెసిడెంటు కొడుకు. పార్వతి వోట్లన్నీ వాడికే! ఇహ నువ్వు గెలవాలంటే ఒకటే మార్గం. రంగారావ్ పోటీ మానుకోవాలి. పోటీ మనం మాన్పించాలి."

"అదెలా?"

"ఎలాగంటే..." నే నందుకున్నాను. "మళ్ళీ మన మబ్బుగాడు 'పార్వతి'ని కలవాలి. కలిసి ఘట్టిగా రెక్వెస్టు చేయాలి. రంగారావ్‌ని విత్‌డ్రా అయేట్టు చేస్తే మనం యేం చేయటానికైనా సిద్ధంగా వున్నామని చెప్పాలి."

"హో హో! మేఘదూతమా!" చారి యికిలించాడు.

"ఇప్పుడేగదురా వెళ్ళొచ్చింది. మళ్ళీ వెడితేమాత్రం యేంలాభం?" రాయుడన్నాడు.

"కాదులే.. మబ్బుగాడొక్కడే వెళ్తే పనవుతుంది' ధుమ ధుమలాడుతూ అన్నాను. అందరం కలిసి మబ్బుగాణ్ణి పంపటానికి నిశ్చయించుకున్నాం.

"అల్లైన వో దూతా! ఆ పార్వతి దేవితో నా మాటలుగా యిట్లు చెప్పుము. గీతిగాడు ఆవేశంలో చెప్పుకుపోతున్నాడు నాటక ఫక్కీలో. "వో పార్వతీ! నేను నీ దాసుడను. నీ కొరకే జీవించుచున్నాను. నీవు లేనిదే బ్రతుకను. నన్ను గెలిపించి నీవాణ్ణి చేసుకో! పోనీ మొదటిది మానేసి రెండోదైనా చెయ్!" అప్పటికి పరిస్థితి యించు మించు అందరికీ అర్థంఅయింది.

"సరే ఐతే! వస్తార్రా, పీ... కాదుకాదు... గీతా!" అంటూ మబ్బుగాడు వెళ్ళాడు. వాడెళ్ళిన్తర్వాత అంతా నా చుట్టూ చేరి, "ఏమిట్రా! వాడు వెళ్తూ వెళ్తూ 'పీ' అనబోయి మానేశాడు. ఏమిటా 'పీ'? ఏమా కథ?" అని ప్రశ్నించారు.

నేను కథంతా చెప్పటం పూర్తిచేసే సరికి గీతిగాడు మంచంమీద పేషంటులా పడున్నాడు. వాడి గడ్డం గంటలోనే యెంతో పెరిగినట్టుగా వుంది. మంచం చుట్టూ చేరారంతా! నేనింకా చెప్పబోతూంటే... "ఆపరా.. ఆపు!" గీతిగా డంటున్నాడు నీరసంగా! "నే నింక వినలేన్రా శాస్త్రూ. ఒరేయ్! ఇహమీద మనం మబ్బుగాణ్ణి 'మేఘం' అనే పిలుద్దాం. కనీసం పారు కోసం . . .".

"అయ్యో... అయ్యో. ఇదెక్కడి విడ్డూరం?!" మిత్రులు ముక్కుమీద వేలేసుకున్నారు.

"మరి తెలుగు లెక్చరర్ని 'చెంబు' అన్నప్పుడూ, ప్రిన్సిపాల్‌కి 'శిశుపాలుడు' అని పేరు పెట్టినప్పుడూ లేదేం... నీ దాకా వస్తేగాని తెలిలేదట్రా పీతా!" అని రంగనాథం అందుకున్నాడు.

"ఒరేయ్ రంగీ! పీతా... తాతా అంటే కీళ్ళు విరిచేసా!"

"రేయ్ వెధవల్లారా! 'ఆఫ్ రాల్' ఒక 'ప్రే' వలన మనం యిలా గొడవలు పెంచుకోవటం బాగోలేదు. అది మన ఆదర్శాలకే విరుద్ధం. ఇహ ఆ గొడవ ఆపే కర్తవ్యం ఆలోచించండి."

"మరి! పార్వతితో యిన్నిసార్లు మాట్లాడ్డం మన ఆదర్శాలకి విరుద్ధంకాదా అమ్మా!" చలం ముద్దులుగుడుస్తున్నాడు అక్కడికి వాడొక్కడో బలవంతాన అమ్మాయిలకి దూరం చేస్తున్నట్టు.

మొత్తంమీద అందరికీ అమ్మాయిలతో మాట్లాడాలనే వుంది. కానీ ఆదర్శాలు అడ్డుకుని ఆపేస్తున్నాయ్.

ఇంతలో చారి కిటికీలోంచి తొంగి తొంగి చూస్తున్నాడు. 'ఏమిట్రా అది' అని నే నటుగా వెళ్ళాను. ప్రక్కింటి సీత నీళ్ళు తోడుకుంటోంది. చారిని నమిలి మింగేయాలనిపించింది. ఒక్క గుద్దుగుద్ది లాక్కొచ్చానవతలికి.

పోస్టువాడొచ్చి రాయుడి కొక్కడికే ఉత్తరం పడేశాడు. వాడు అందులోనే యిమ్మర్సయిపోవటం చూసి ఆ ఉత్తరం యెక్కణ్ణించోనని లాక్కుని చూశాను. వాళ్ళక్క కూతురితో వీడి పెళ్ళి నిశ్చయము అయింది. నాకు ఒళ్ళు మండు

ఆంధ్రప్రదేశంలో అన్ని షాపులలోను దొరుకుచున్నది
గోపాల్ పళ్ళపొడి


తొంది. ఈ అసోషియేషనకి యేదో శని పట్టింది. నే నా ఉత్తరం సంగతి మిగతా వాళ్లకి చెప్పకుండా దాచేశాను. రాయుడు చాటుగా దణ్ణం పెట్టాడు.

వో అరగంట తర్వాత మబ్బుగాడొచ్చాడు. ఏమైందని అందరం వాడిచుట్టూ చేరాం. వాడు తాపీగా పడుకుని ముసుగెట్టాడు.

"ఏమిట్రా ఆ వెధవ మౌనం.. తియ్ ముసుగు!" చలం అరిచాడు. "ఒరేయ్ మేఘం! ఏం జరిగిందో చెప్పరా!" గీతిగాడు బ్రతిమాలు కున్నాడు. ఈ క్రొత్త సంబోధన మబ్బుగాడి కొక్కడికే కాదు, మాకూ యెబ్బెట్టుగానే వుంది. ఐనా రూల్ మారింది. అలాగే పిలవాలి మరి!

మబ్బుగాడు వుపన్యాస ధోరణిలో పోజు పెట్టాడు. మేమంతా వినే ధోరణిలో కూర్చున్నాం.

"ఇక్కణ్ణించి వెళ్లానా! పార్వతీదేవిని కలుసుకున్నాను. రంగారావ్ కూడా అక్కడికి వచ్చాడు. వాళ్లు మాకేదో దూరపు బంధువుల్ట. అతనే అన్నాడు. ఏదేదోవరసంతా తిరగేసి పార్వతి నాకు అత్తకూతురవుతుందని తేల్చాడు."

శ్రోతల్లో నీరసం ఆవహించింది. గీతిగాడికైతే నిలువుగుడ్లు పడుతున్నాయ్.

"అది అప్రస్తుతం" అరిచాడు చారి ఉక్రోషంగా.

"కాదు... ప్రస్తుతమే. ఎలాగంటే..." (మేఘనాథుడు మొదలెట్టాడు. ఇహనించి వీణ్ణి లానే పిలవాలి మరి. యిప్పుడు వాడి స్టేటస్ పెరిగింది.)

"నేను గీతిగాడి తరపున దూతగా వెళ్లానా... వెళ్లి... రంగారావ్‌ని విత్‌డ్రా చేసుకోమన్నాను. పార్వతీదేవీ, రంగారావ్ ఏక కంఠంతో 'సరే' నన్నారు."

అంతా చప్పట్లు చరిచారు. గీతిగాడి మొహంలో యేదో ఆశాజ్యోతి వెలిగింది. నేనూ శ్రద్ధగా వింటున్నాను.

"ఐతే కొన్ని షరతులమీద!" మేఘనాథుడు లేచి నుంచున్నాడు.

"ఏమిటవి?" అందరం ప్రశ్నించాం.

"ఒకటి... నన్ను మీరెవరూ 'మబ్బు' అని పిలవకూడదట."

"హో యస్! అదెప్పుడో మానేశాంరా మేఘం. ఐనా చక్కని పేరుంటే మబ్బేమిటి మబ్బు... అసహ్యంగా... క్రాచలం!" గీతిగాడు సంజాయిషీగా అన్నాడు. చలం అవునన్నాడు సంగిరెద్దులా తలూపుతూ.

చారి "జై... మేఘనాథుడికీ జై... జై.. మేఘదూతానికీ జై" అని అరిపించాడు. హాలు రీ సౌండిచ్చింది.

"రెండు..." కాస్తంత ఆగాడు మేఘం. మేమంతా అలాగే చూస్తున్నాం.

"మీరు నన్ను మరిచి పోవాలి!"

"అంటే?!!"

"నేని 'ఫార్ ఫ్రమ్‌ది లేడీస్ క్రౌడ్' అసోషియేషన్నించి దూరంగా వెళ్లిపోతున్నాను."

"ఏం?"

"ఏమంటే..." అప్పటికే మేఘం మెట్లన్నీ దిగి గేటుదాకా వెళ్లిపోయాడు. "పార్వతితో నా పెళ్లి. ఎలక్షన్ల ముందు రోజున!" గేటు దగ్గర రెడీగావున్న నీలి రంగు యెంబాసిడర్లో యెక్కి తుర్రుమంది మేఘం.

కలగంటున్నామా అనిపించింది. భ్రమిస్తున్నామా అనిపించింది. కాదు... మోసపోయాం అనిపించింది. వీటన్నిటినీ మించి యేదో జరుగుతున్నట్టనిపించింది.

వెనక్కి తిరిగి ఒక్కసారి మిత్రులందరి వంకా చూశాను. చారి జుట్టు పీక్కుంటున్నాడు జరిగిందేమిటో అర్థం చేసుకోటానికి. రంగనాథం 'హహ్హ! మేఘనాథుడు డీలు తిప్పాడ్రా!' అన్నాడు పేక భాషలో. రాయుడు 'హరహరా!' అంటూ దేవాలయం దగ్గర పోజులో పడ్డాడు. చలం నాకు దగ్గరగా వచ్చి "ఆ కారు డ్రైవ్ చేస్తున్న దెవరో తెల్సా! పార్వతి. మన్ని చూసి రావణాసురుణ్ణి చూసి ద్రౌపది నవ్వినట్టు నవ్విందిరా!" అన్నాడు. "వెధవ్వెట్లెయ్యకురా చలం" అని కసిరాను. గీతిగాడు మాటా పలుకూ లేకుండా పడిపోయాడు. దగ్గరగా వెళ్లి చెయ్యి పట్టుకుని చూశాను. ఒళ్లంతా చెమటలు పట్టాయి. నాడి బాగానే వుంది. జరిగింది సింహావలోకనం చేసుకుంటూ చతికిలబడ్డాను. కణతలు నొప్పిగా వున్నాయ్... కళ్లు మూసుకున్నాను.

మళ్లీ లేచేసరికి రాయుడు లేడు. ఇంటికి పోయాడని చెప్పాడు చారి. రంగనాథం వాడి సీక్రెట్ గర్ల్‌ఫ్రెండ్‌ని పబ్లిగ్గా కలుసుకోటానికి పోయాట్ట. చారి కిటికీలోంచి మళ్లీ తొంగి తొంగి చూస్తున్నాడు. చలం గీతిగాడి దగ్గర కూర్చున్నాడు. గీతిగాడు మెల్లిగా కళ్లు తెరిచి,

"ఏమైంది... యిప్పు డెక్కడున్నాను?" అన్నాడు.

చలం మళ్లీ వెధవ్వేట్లు వేస్తున్నాడు. "అదికాదా! నీకేమో మతిపోయింది. మేమంతా నిన్ను మెంటల్ హాస్పిటల్‌కి చేర్చాం. నువ్వక్కడ గంతులేస్తోంటే డాక్టర్ పట్టుకోటానికొచ్చాడు. నువ్వు డాక్టర్ని కొరికావ్. ఆ దెబ్బతో నీకు పిచ్చి తగ్గి, డాక్టర్కి పిచ్చి పట్టుకుంది. నిన్నిక్కడికి చేర్చాం.... యింతలో..."

"నోర్మూయ్యరా చలం! నీ పిచ్చువిట్లకి వేళాపాళా లేదు." విసుక్కున్నాడు గీతాయ్. మళ్లీ అన్నాడు అందరితోనూ చెబుతున్నట్టుగా, "మాశాస్త్రా! నే నెప్పుడూ మొత్తుకుంటూనే వున్నాను. ఫ్రెండ్షిప్ నాశనం కావటానికి కారణం స్త్రీ. పురాణాలు తీసుకున్నా రావణుడూ, దుర్యోధనుడూ మొదలైన హీరోల వినాశానికి కారణం స్త్రీ. చరిత్రలో కూడా అంతే. ప్రతి దానికీ స్త్రీ... స్త్రీ... స్త్రీ... స్త్రీ... ఒరేయ్ శాస్త్రీ! ఆఖరికి యిప్పుడు కూడా.."

చారి కల్పించుకున్నాడు, "తగ్గరా తగ్గు. అసలంతకీ కథేమిటి?! ఎవరికి వాళ్లే గుమ్మడికాయంత ముత్యాలు. మనో ప్రతివాడికీ లోపలోక భావం.. పైకి మాత్రం ఆదర్శాలకి రుబిడిపి వూరుకోవటం. అనవసరంగా స్త్రీని ఆడిపోసుకోకు. పార్వతిని గురించి ఆలోచించని దెవరు మనలో! ఇప్పటికైనా మనం గ్రహించాల్సిం దేమిటంటే టెర్లిన్ డ్రస్సేసుకుని కాల్లో తిరిగినంత మాత్రాన అమ్మాయిలు మోసపోరు! మబ్బు గాడిలాగా బాగా చదివి ఫస్టు వస్తేనే 'హీరో' అనిపించుకునేది. ఈ మిగతా నేషాలన్నీ నువ్వు చెప్పిన పురాణ హీరోల కోసకి వెందేవే... ఏదైతేనేం? నువ్వు పోటీలేకుండా గెల్చేశావ్ ఫో! ఇదంతా ఆ మేఘదూతం వలనే!" "ఛ! నోర్మూయ్! మేఘదూతం అంతా తలక్రిందులయింది. మేఘదూతంట... మేఘ దూతం! మేఘ దూతమూ, వల్లకాడూనూ.." వాపోయాడు గీతాపుత్రం.

నే నన్నాను గదా, "అవును. మేఘ దూతం తల్లక్రిందు లయినది... కథే తారుమారు అయింది. కారణం... దూత 'మేఘం' " అని. అప్పుడు గీతిగాడు, "కాదు! 'ధూర్త మేఘం'" అన్నాడు కసిగా!